

జనవరి నాలుగో వారంలో చలి ఉత్సవం

- కలెక్టర్ దినేష్ కుమార్



ప్రజాశక్తి-పాడేరు: విశాఖపట్నంలో ప్రతి సంవత్సరం జరిగే విశాఖ ఉత్సవం మరియు చలి ఉత్సవాల తేదీలలో మార్పు జరిగిందని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ అన్నారు. విశాఖ ఉత్సవం, చలి ఉత్సవ ఈ రెండు ఉత్సవాలను కలిపి సైడ్ లైన్స్‌లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్సవాలను వాస్తవానికి డిసెంబర్ చివరి వారంలో నిర్వహించాలని ప్రణాళిక రచించారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి అందుబాటులో ఉండక పోవడంతో ఈ ఉత్సవాలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలను జనవరి మాసంలో నిర్వహించాలని నిర్ణయించారు. డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి చివరి వారానికి ఈ ఉత్సవాలు వాయిదా పడినట్లు, ఈ మార్పును ప్రజలు గమనించాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.



వాటర్ ట్యాంక్ శుభ్రతా పనులు చేయిస్తున్న సర్పంచ్



పరిశుభ్రతా కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు

సుంకరమెట్టకు ఉత్తమ అవార్డు

- పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ఆదర్శం
- పలు గ్రామాలకు తాగునీటి సరఫరా
- ఎల్ఇడి లైట్లు ఏర్పాటు, విరివిగా సేవా కార్యక్రమాలు
- సిపిఎం సర్పంచ్ చిన్నబాబుకు ప్రశంసలు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్, పంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి-అరకులోయరూరల్: పరిశుభ్రత పరిరక్షణ, పచ్చదనం ప్రోత్సాహం, వ్యర్థాల నిర్వహణలో వినూత్న కార్యక్రమాలు చేపట్టిన సుంకరమెట్ట పంచాయితీ జిల్లా స్థాయి ఉత్తమ పంచాయితీ అవార్డును సాధించింది.స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలను గ్రామస్థాయిలో సమర్థంగా అమలు చేస్తూ, ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచుతూ, పర్యావరణ పరిరక్షణలో ముందడుగు వేసినందుకు ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. సిపిఎం సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు నాయకత్వంలో సచివాలయ సిబ్బంది,గ్రామ ప్రజలు సమన్వయంతో చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమాలను గుర్తించిన ప్రభుత్వం పంచాయితీకి ఉత్తమ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును సోమవారం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా పంచాయితీ ప్రతినిధులు, అధికారులు అందుకున్నారు. గ్రామంలో ద్రవ వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాల శుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై కఠినంగా అమలు తదితర రంగాల్లో ప్రత్యేక చొరవ చూపడం, ప్రతి శుక్రవారం 'ఫ్రైడ్ డ్రై డే'గా స్వచ్ఛత ,పచ్చదనం కార్యక్రమాలను నిర్వహించడంతో పంచాయితీకి విశేషమైన గుర్తింపునిచ్చాయి. పరిశుభ్రత, పచ్చదనం విభాగంలో జిల్లా స్థాయిలోనూ అవార్డు రావడం పంచాయితీకి గర్వకారణమని స్థానికులు పేర్కొన్నారు. పంచాయతీని ఇంకా అభివృద్ధి పథంలో నడిపే దిశగా కృషి కొనసాగుతుందని సర్పంచ్ తెలిపారు. 23 గ్రామాలకు తాగునీటి సదుపాయం కల్పించడంలో సర్పంచ్ చిన్నబాబు అహర్నిశల కృషి చేస్తున్నారు. సుంకరమెట్ట పంచాయితీ పరిధిలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు నిరంతరం పాటు పడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, సంఘంవలస, లింబగూడ, కె.బెడ్డగూడ గ్రామాలకు గ్రావిటీ స్కీమ్ ద్వారా తాగునీటి సరఫరాను అందించారు. బోయిగూడ, కొత్త బోయిగూడలలో బోరు బావుల మరమ్మతులు చేపట్టి, మోటార్ సప్లై ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. పెదగంగుడిలో జల్ జీవన్ మిషన్ కింద బావి మరమ్మతులు పూర్తి చేశారు. కిన్నంగూడ, ఎస్ బెడ్డగూడ, గాంధమెట్ట, తోటవలస, దోబురంగిని గ్రామాలకు మోటార్ల ద్వారా తాగునీరు అందుబాటులోకి తెచ్చారు. పంచాయితీ పరిధిలోని 23 గ్రామాలకు 275 విద్యుత్ స్తంభాలపై ఎల్ఈడి లైట్లను ఏర్పాటు చేశారు. పంచాయితీ కార్యాలయం మరుగుదొడ్ల మరమ్మతులు, బోరు బావుల పునరుద్ధరణ, కొత్త మోటార్ల ఏర్పాటు వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇటీవల మొంథా తుపాన్ ప్రభావంతో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు గ్రామాల్లో స్వయంగా పర్యటించి, ప్రజల సమస్యలు విని వెంటనే స్పందించడం సర్పంచ్ సేవాభావానికి నిదర్శనం. సచివాలయంలోనే మకాం వేసి ప్రజా సమస్యల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించారు. తాగునీటి సౌకర్యాల నుంచి ప్రజా సేవల వరకు ప్రతి అంశంలో తన చొరవ చూపుతూ సుంకరమెట్ట పంచాయితీని ఆదర్శ పంచాయితీగా తీర్చిదిద్దేందుకు సర్పంచ్ చిన్నబాబు చేస్తున్న కృషి ప్రశంసనీయమని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా గిరిజన నిరుపేద విద్యార్థులకు దాతల సహాయంతో ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేశారు.

శ్రమదానంతో రోడ్డు పనులు

ప్రజాశక్తి -అనంతగిరి: రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు శ్రమాధానంతో మట్టి రోడ్డు పనులు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అనంతగిరి మండలం మారుమూల కివర్ల పంచాయతీ పరిధి జంపపుట్టు గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజనులు ఊరూరా తరలివచ్చి శ్రమధానంతో మట్టి రోడ్డు పనులు చేస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో రోడ్డు పనులు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు సోడేపల్లి .సోములు, నారాయణ, సత్యనారాయణలు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మారుమూల గిరిజన గ్రామాలకు డోలీ రహిత ఆంధ్ర ప్రదేశ్‌గా మారుస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణెదల .పవన్ కళ్యాణ్ గత తొమ్మిది నెలల క్రితం పక్క పంచాయతీ పెదకోటలో పర్యటించి హామీ ఇచ్చారని తెలిపారు. నేటికీ తమ గ్రామానికి కనీసం రోడ్డు, తాగునీటి వంటి మౌలిక వసతులు లేవని వారు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ప్రకటనలకె ప్రమితమవుతుంది తప్ప ఆచరణలో అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సింహాచలం, ఈశ్వరరావు, రవికుమార్ పాల్గొన్నారు.



రోడ్డు పనులు చేపడుతున్న గిరిజనులు



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

ఘనంగా ఎస్ఎఫ్ఐ మండల మహాసభ

-నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గురువారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ పాడేరు మండల మహాసభ విజయవంతం అయ్యింది. ఈ మండల మహాసభలో నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు ఈ మేరకు ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు రవి, సింహాద్రి ఎన్నికయ్యారు. ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ కో కన్వీనర్ శైలు, సంధ్య, సూర్య మణి, గాయత్రి లు ఎన్నికయ్యారు.. నూతన ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు, కన్వీనర్, కో కన్వీనర్‌లు విద్యార్థుల సమస్యల కోసం పోరాడాలని అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను, జీవన్ కృష్ణ సూచించారు. విద్యార్థి ఉద్యమంలో అలుపెరగని పోరాటం కొనసాగించాలని సూచించారు. హక్కులను, చట్టాలను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి సాధించుకుందామని పిలుపునిచ్చారు. అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ రెండవ జిల్లా మహాసభలను ఈనెల 8న జరుగుతుందని, జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లూరి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చిన్నారావ్, సింహాద్రి, కార్తీక్, జీవన్ కృష్ణ, నూతన అధ్యక్ష కార్యదర్శులు రవి, సింహాద్రి, గర్ల్స్ కన్వీనింగ్ కమిటీ, శైలు, సంధ్య, సూర్యమణి, గాయత్రి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-యస్ రాయవరం: మండలంలో ఉప్పరపల్లి, సైతార్‌పేట గ్రామంలో రైతులకు భూసార పరీక్ష పత్రాలు, ఉపయోగాలపై మండల వ్యవసాయ అధికారి సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె గురువారం మాట్లాడుతూ, రైతులు మట్టి నమూనాలను వారి పొలాల నుంచి సేకరించుకొని మట్టి సాయిల్ టెస్టింగ్ చేయించుకోవాలని సూచించడం జరిగిందన్నారు.మట్టి నమూనాలను ఎలా సేకరించాలి, వచ్చిన ప్రామాణికాలు బట్టి మనం ఎరువులు ఎంత వేయాలి అనే దాని పైన ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు

ప్రజాశక్తి-పాడేరు: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో డివిజనల్ డెవలప్మెంట్ అధికారి (డిడివో) కార్యాలయం ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు పాడేరు జిల్లా కేంద్రములో నూతనంగా నిర్మించిన డివిజనల్ డెవలప్మెంట్ అధికారి (డీడీవో) కార్యాలయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్తూరు ఆర్డీవో కార్యాలయము నుండి గురువారం వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమములో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రములో 77 డివిజనల్ డెవలప్మెంట్ అధికారి (డీడీవో) కార్యాలయాలను ప్రారంబిస్తే అందులో పాడేరు కేంద్రముగా ఒక కార్యాలయమును ప్రారంబించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి అల్లూరి సీతారామ రాజు జిల్లా ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపారు. ఈ కార్యాలయాల్లో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి డిడిఓ, డి ఎల్‌పిఓ, ఏపిడి, డ్వామా ఇతర అధికారులు సేవలందించను న్నారన్నారు. డివిజినల్ డెవలప్మెంట్ కార్యాలయాల ఏర్పాటుతో ప్రతి పంచాయతీ స్వయం ప్రతిపత్తి కలిగి స్వతంత్రంగా వ్యవహరిస్తూ ప్రజల అవసరాలను తీర్చగలమని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలను సమీకృతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ చేయవచ్చున్నారు. గ్రామాలను సుసంపన్నం చేయుటకు గ్రామ సచివలయాలను బలోపేతం చేయుటకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందించుటకు ఈ కార్యాలయాలు ఉపయోగపడతాయన్నారు

పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పాలనాపరమైన సంస్కారణాల్లో భాగంగా జిఓఎంఎస్ నెంబర్ 57, 58 లను తీసుకు రావడం జరిగిందని తెలిపారు. మండల స్థాయిలో అభివద్ధి శాఖకు ఎంపిడిఓ లు, రెవెన్యూ శాఖకు తహశీల్దార్ లు, పోలీస్ శాఖ కు సర్కిల్ ఇన్స్పెక్టర్ లు ఉంటారని, వీరికి సంబంధించి రెవెన్యూ మరియు పోలీస్ శాఖ కు మాత్రమే డివిజినల్ కార్యాలయాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల తో ఇక పై పంచాయతీరాజ్ శాఖకు కూడా ఒక డివిజినల్ స్థాయి అధికారి ఉంటారన్నారు. ఈ కార్యక్రమములో పాడేరు ఎంపిపి సోనావాయి రత్నకుమారి, పాడేరు జడ్పిటిసీ కిముడు గాయత్రీ దేవి, సర్పంచ్ పాడేరు కొట్టగుళ్ళ ఉషా రాణి, డివిజనల్ పంచాయతీ అధికారి కే పి చంద్ర శేఖర్, డ్వామా పిడి విద్య సాగర్, తదతరులు పాల్గొన్నారు.

లంకపాకల రహదారి అస్తవ్యస్తం

- వర్షానికి గోతుల్లో నీరు చేరి చెరువును తలపిస్తున్న వైనం
- బురదమయం కావడంతో ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు



గోతుల్లో వర్షపు నీరు నిండి బురదమయంగా ఉన్న లంకపాకుల రహదారి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలంలో బుధవారం కురిసిన వర్షానికి లంకపాకల రహదారి అస్తవ్యస్తంగా మారింది. రహదారి గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపించడంతో వాహనచోధకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. లంకపాకల నుంచి పాలగెడ్డ వరకు గోతులు పూడ్చడానికి సుమారు రూ.18 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దానికి సంబంధించిన టెండర్లు ప్రక్రియ పూర్తిచేసి సంబంధిత కాంట్రాక్టర్‌కి పనులు అప్పగించింది. గుత్తేదారుడు లంకపాక నుంచి రహదారి పనులు గత నెలలో ప్రారంభించారు. జెసిబి, ఇతర యంత్రాలతో మట్టి తొలగించి రహదారిని రబ్బింగ్ చేసి సమాంతరంగా చేసే విధంగా తూతూ మంత్రంగా పనులు చేపట్టారు. ఆర్ అండ్ బి అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాంట్రాక్ట్ పనుల్లో కాలయాపన జరిగింది. ముందుగా రహదారి గోతుల్లో వేసిన మట్టి బుధవారం పడిన వర్షానికి బురదమయంగా మారి రహదారి మరింత అధ్వాన పరిస్థితికి నెట్టబడింది. రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు వాహన చోదకులు నానా అవస్థలకు గురవుతున్నారు. సీలేరు నుంచి లంకపాకల మీదగా మైదాన ప్రాంతానికి వెళ్లడానికి తీవ్ర భయాందోళన చెందుతున్నారు. రహదారి బురదతో చిత్తడి చిత్తడిగా ఉండడంతో ఏ క్షణంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రోగులు అత్యవసర సమయంలో మైదాన ప్రాంతంలో వైద్య సేవలు పొందలేని పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు చొరవ చూపి రహదారి పనులు తక్షణమే చేపట్టాలని అల్లూరి డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ కోరారు.

బోధనేతర పనులు తగ్గించాలి

యుటిఎఫ్ జిల్లా నాయకులు పండా కృష్ణయ్య



ప్రమాణ స్వీకారం చేస్తున్న యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-ఎటపాక : ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు పండా కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్) ఎటపాక మండల కౌన్సిల్ సమావేశం భద్రాచలంలోని నాగటి నారాయణ ప్రాంగణంలో గురువారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాలు మారుతున్నా ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడి తగ్గడం లేదన్నారు. రకరకాల యాప్‌ల రూపంలో ఉపాధ్యాయులు బోధనేతర పనులలో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఉత్తీర్ణత అవ్వాలనే కొత్త నిబంధనతో ప్రభుత్వ విద్యా విధానాన్ని ఇంకా నీరుగార్చే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ విద్యా విధానాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే ఇలా నీరు గార్చే విధంగా చేసి పేద ప్రజలకు విద్యను దూరం చేసే చర్యలు చేపడుతున్నాయని విమర్శించారు. అనంతరం కృష్ణయ్య సమక్షంలో 12 మందితో యుటిఎఫ్ ఎటపాక మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పి.విజయ్, కే.శ్రీనివాసులు, సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కాటన్ హరినాథ్, ప్రభాకర్, జహీదా బేగం, ప్రియాంక, రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, పాయం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జంతువులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అడవిలో సంచరించే అడవి జంతువులను, అడవులను, కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని స్థానిక ఎంపీడీవో లోకలు యాదగిరిశ్వరరావు, ఐఎస్‌బి అధికారులు అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో గురువారం సర్పంచ్ కుంజం జగన్నాథం అధ్యక్షతన వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన గ్రామసభ జరిగింది. సభలో అధికారులు అడవి జంతువులు, అడవులు, వెదురు పెంపకం, గిరిజన ప్రాంతంలో లభించే అటవీ ఫలాలైన కర్ర తేనే, కొండచిపుర్లు, కుంకుడుకాయలు, జీడిపిక్కలు, అడవి దుంపలు వంటి ఫలాలను కాపాడుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఐఎస్బీ అధికారులు, వెలుగు ఏపీఎం రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి, కొండపల్లి శరభవరం సచివాలయ సిబ్బంది, వెలుగు సీసీలు, డ్వాక్రా మహిళలు, పీసా కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రి రామానాయుడును కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-దేవీపట్నం : రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో టిడిపి నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురవుతున్న దేవీపట్నం మండలం, గొందూరు గ్రామంలోని గండి పోశమ్మ అమ్మవారి దేవాలయాన్ని ముంపు బారి నుండి రక్షించి అభివృద్ధి చేయడానికి రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసి ప్రభుత్వం జివో జారీ చేసిన నేపథ్యంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గిరిజనుల మనోభావాలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని గౌరవించి గండి పోశమ్మ అమ్మవారి దేవాలయం అభివృద్ధికి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గండి పోశమ్మ అమ్మవారి దేవాలయ గ్రేడ్-1 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గండి వెంకట లక్ష్మీ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు గోల చంటిబాబు, ఇందుకూరుపేట సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు, మాజీ మండల అధ్యక్షులు ముంద్రు మధుసూదన్‌రావు, టిడిపి నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి రామానాయుడును సత్కరించిన టిడిపి నాయకులు

డిఎవి సిబ్బందికి జీతాల బకాయి చెల్లించాలి

ప్రజాశక్తి-సీలేరు : జీకే.వీధి మండలం సీలేరు డిఏవి పాఠశాలలో ఉపాధ్యాయులు, ఆఫీస్ సిబ్బందిక మూడు నెలల నుంచి జీతాలు అందక కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని స్థానిక సిఐటియు నాయకులు ఎస్‌కె.సుభాన్ విచారం వ్యక్తం చేశారు. తక్షణమే ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఏపీ జెన్కో యాజమాన్యం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఏపీ జెన్కో ఆధీనంలో స్థానిక డిఏవి పాఠశాల నడుపుతున్నారని, ఉద్యోగులకు సిబ్బందికి ప్రతి నెలా జెన్కో జీతాలు చెల్లిస్తుందని తెలిపారు. ఈ పాఠశాలలో ఏపీ జెన్కో ఇంజనీర్లు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వివిధ శాఖల ఉద్యోగుల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. ఏపీ జెన్కో యాజమాన్యం మూడు నెలల నుంచి జీతాలకు సంబంధించి బడ్జెట్ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. జీతాలు అందకపోవడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఇప్పటికైనా ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు, డిఏవి పాఠశాల ఎల్ఎంసి చైర్మన్ ఇన్చార్జి ఎస్ఇ సివిల్ చిన్న కామేశ్వరరావు స్పందించి డిఏవి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మూడు నెలల జీతాలు పూర్తిస్థాయిలో విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

'మన డబ్బులు- మన లెక్కలు'పై అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మన డబ్బులు-మన లెక్కలు అనే అంశంపై మండల మహిళా సమైక్య అధికారులు గురువారం అవగాహన కల్పించారు. తొలిత స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం జరిగింది. అనంతరం మహిళలు రాజవొమ్మంగి గ్రామంలో ర్యాలీ చేసి అంబేడ్కర్ సెంటర్ వద్ద మానవహారంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎంఎస్ లీడర్లు మాట్లాడుతూ సంఘం బలోపేతం కావాలన్నా, సభ్యులలో ఐక్యత పెరగాలన్నా మన డబ్బులు మనమే లెక్కలు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రామాంజనేయులు, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని గూడూరు పంచాయతీ పరిధి దేవరపల్లి గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మడవి బుజ్జి, ఎంపిటిసి సున్నం గౌరమ్మ మాట్లాడుతూ దేవరపల్లి గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కల్వర్టు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణం పూర్తయ్యిన తరువాత గ్రామ ప్రజలకు సురక్షితమైన, సులభమైన రాకపోకలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కూర సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి గొల్లు అమృతరావు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గిరిజనులు


గిరిజనేతరులతో మాట్లాడుతున్న ఆర్‌ఐ

అక్రమ కట్టడాలు నిలిపివేత

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంతలో గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను స్థానిక రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ బిపిఎం రాజు నిలుపుదల చేశారు. ఈనెల 4న ప్రజాశక్తిలో అక్రమ కట్టడాలు తొలగించాలని వార్త ప్రచురితమయ్యింది. దీంతో, స్పందించిన ఆయన గ్రామంలో సందర్శించి మెయిన్ రోడ్డు పక్కన నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేశారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులు అక్రమ కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'వైసిపి నేతలను చేర్చుకోవడం సరికాదు'

ప్రజాశక్తి- కాశీపట్నం: నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీలో ఎన్నో ఏళ్లుగా జెండా మోస్తూ పార్టీ అభివృద్ధికి పనిచేస్తున్న మండల కమిటీ, పంచాయతీ కమిటీలను సంప్రదించకుండా వైసిపి నాయకులను టిడిపి పార్టీలోకి చేర్చుకోవడం సరికాదని అనంతగిరి మండల తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గాలి నరేంద్ర అన్నారు. మండలంలో కొత్తూరు పంచాయతీ కొత్తూరు గ్రామంలో బుధవారం మండల అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో రైతన్న మీ- కోసం కార్యక్రమంలో భాగంగా శివలింగపురం గ్రామానికి చెందిన భీమవరపు గంగులు, అతని అనుచరులను పార్టీలో ఆహ్వానించారని తెలిపారు. పార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా ఆయనను ప్రకటించారని, ఇది సమంజసం కాదన్నారు. పార్టీ అభివృద్ధికి తన సొంత నిధులు ఖర్చు చేస్తూ గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేస్తున్నామన్నారు. తమను సంప్రదించకుండా వైసిపి నాయకులను ఎలా పార్టీలోకి తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆలోచించి పార్టీ విధివిధానాల ప్రకారం నడుచుకోవాలని నరేంద్ర, గ్రామ కమిటీ అధ్యక్షులు డుంబరి కృష్ణ, ఉపాధ్యక్షులు దుద్దు ఈశ్వరమ్మ, నాయకులు డుంబరి నాగేశ్వరరావు, వెంకటరావు, దేముడు, శ్యామ్, దుద్దు ఆనంద్ సూచించారు.

నేటి నుంచి గీతంలో డెమ్‌కాన్ సదస్సు

ప్రజాశక్తి-మధురవాడ : డిమెన్షియా వ్యాధి నివారణ, చికిత్స, అవగాహన కోసం పనిచేస్తున్న జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థ డిమెన్షియా ఇండియా అలయన్స్, గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆసుపత్రి, స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్, నిమ్ హెన్సు-సెంటర్ ఫర్ బ్రెయిన్ రీసెర్చ్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్, ప్రభుత్వ మానసిక ఆరోగ్య సంస్థ సంయుక్తంగా ఈ నెల 5, 6 తేదీలలో డెమ్‌కాన్-2025 పేరిట సమావేశాలు నిర్వహిస్తున్నాయని సమావేశ నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎన్‌.ఎస్.రాజు తెలిపారు. రెండు రోజుల పాటు గీతం వైద్య కళాశాల వేదికగా జరిగే ఈ జాతీయ సమావేశాలకు దేశంలోని వైద్యులు, పరిశోధకులు, విధాన నిర్ణేతలు, విద్యార్థులు, ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు, సంరక్షకులు, వృద్ధుల సంరక్షణ సంస్థలలో సహా దాదాపు 800 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా విశాఖపట్నం కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిరప్రసాద్, గౌరవ అతిథులుగా రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ నీలిమా సురపనేని, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ రాజిందర్ కె.ధమిజా హాజరుకానున్నారని పేర్కొన్నారు. డెమ్‌కాన్-25 భాగంగా, జిల్లాలలో డిమెన్షియా సంరక్షణను బలోపేతం చేయడానికి, ముందస్తు గుర్తింపు కోసం సామర్థ్యాన్ని పెంపొందించడానికి రిఫరల్, కమ్యూనిటీ స్థాయి మద్దతు కోసం ప్రభుత్వ వైద్యులకు ప్రత్యేక శిక్షణా సెషన్లు కూడా నిర్వహించనున్నట్లు వివరించారు.

తుప్పపట్టిన అరకులోయ ముఖద్వారం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అరకులోయలో దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం ఇప్పుడు పర్యాటకుల దృష్టిని ఆకర్షించడంలో కాకుండా, నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. కాలక్రమంలో ద్వారంపై పూసిన రంగులు పూర్తిగా వెలిసి, ఇనుప స్తంభాలు తీవ్రంగా తుప్పు పట్టి ప్రమాదకర స్థితికి చేరుకున్నాయి. దేశ, విదేశాల నుంచి ప్రతీ రోజూ వేలాది సంఖ్యలో పర్యాటకులు సందర్శించే అరకులోయలో ఈ స్వాగత ద్వారం ఒకప్పుడు ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. గతంలో జరిగిన అరకు ఉత్సవాలు, బెలూన్ ఫెస్టివల్ వంటి ఎన్నో కార్యక్రమాలు జరిగినా స్వాగతం ముఖద్వారం మాత్రం రంగులు వెలసి అలాగే ఉంది. ఇప్పుడు, మరోసారి జనవరిలో జరగనున్న అరకు ఉత్సవాలు దగ్గరపడుతున్న నేపథ్యంలో, స్థానికులు, పర్యాటకులు ఈ ద్వారం పునరుద్ధరణ అవసరాన్ని మళ్లీ గుర్తు చేస్తున్నారు. వచ్చే నెలలో జరగబోయే అరకు ఉత్సవాలకు ముందు స్వాగత ద్వారాన్ని ఆకర్షణీయంగా మార్చాలని స్థానికులు తెలిపారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ఉత్సవాలు జరుపుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ స్వాగతం ద్వారంపై ఎందుకు దృష్టి పెట్టలేదని స్థానికులు మండిపడుతున్నారు. పర్యాటకులను ఆహ్వానించే ప్రథమ చిహ్నం ఇంత దుస్థితిలో ఉండచం సరికాదని అంటున్నారు. స్వాగత ద్వారానికి రంగులు వేసి, తుప్పు పట్టిన భాగాలను మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


తుప్పు పట్టిన ముఖద్వారం

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాలతో అధికారులు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. గురువారం అరకులోయ మండలం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో తహసిల్దార్ కె.కుమారస్వామి, ఏటిడబ్ల్యూఓ కె వెంకటరమణ, ఎంపిడిఓ, ఎంఈఓల సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు అన్నారు. అధికారులు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలోని రక్తపు నిలువలు పెంచాలన్నారు. అనేకమంది గర్భిణీలు, బాలింతలు, సికిల్ సెల్ ఎనీమియా రోగులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఉపయోగపడుతుందని తెలిపారు. రక్తదానంపై అపోహలు విడనాడి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు.జిల్లాలో జిజిహెచ్ పాడేరు ఆసుపత్రిలో రోగులకు ఉచితంగా అత్యవసర సమయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రక్తం అందించబడుతుందని రెడ్ క్రాస్ సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ రక్తదాన శిబిరంలో 25 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో సిఐ హిమగిరి, మండలం విద్యాశాఖ అధికారి వి త్రినాధ్‌రావు, ఈవోపిఆర్డీ, డాక్టర్ రాఘవేంద్ర, రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి సూర్యారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాట్రన్ మెంబర్ బోర్రా నాగరాజు, జిల్లా సభ్యులు టి ప్రసాద్ నాయుడు, సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడి తగదు

ప్రజాశక్తి-చింతపల్లి: ఇంటర్ విద్యార్థి హెూంవర్క్ బుక్కు చూపడంలో ఆలస్యం అయ్యిందన్న నెపంతో గెస్ట్ లెక్చరర్ దాడిచేసిన ఘటన చింతపల్లి జూనియర్ కళాశాలలో చోటు చేసుకుంది. విద్యార్థిపై అమానుషంగా వ్యవహరించిన గెస్ట్ లెక్చరర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదివాసి గిరిజన సంఘం, విద్యార్థి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులు కథనం మేరకు... బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్న బండి జయంతిపై జువాలజీ గెస్ట్ లెక్చరర్ బుధవారం తరగతిలో దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. హెూంవర్క్ పుస్తకం తీసి చూపడం కొంచెం ఆలస్యం కావడంతో ఆగ్రహానికి లోనైన లెక్చరర్ దారుణంగా కొట్టడం తగదన్నారు. దాడితో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని కుటుంబ సభ్యులు చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి విద్యార్థినిని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గెస్ట్ లెక్చరర్‌పై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థి తల్లిదండ్రులు చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


విద్యార్థిని పరామర్శిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

నేరాలు ఘోరాలు

లోయలో ఆటో బోల్తా

- గిరిజన మహిళ దుర్మరణం

- పది మందికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి- చింతపల్లి: చింతపల్లి మండలం జున్నుల గ్రామంలో గురువారం విషాదం చోటుచేసుకుంది. లంబసింగి కొండ రోడ్డులో చింతపల్లి నుంచి నర్సీపట్నం ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి 30 అడుగుల లోయలో పడిపోయింది. అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని నర్సీపట్నం ఆసుపత్రికి తరలించేందుకు గ్రామస్తులు ఆటోలో వెళుతున్నారు. కొండ మార్గంలోని లంబసింగి రోడ్డులో ఆటో లోయలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జున్నుల గ్రామానికి చెందిన గిరిజన మహిళ కిలో సీతమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. వాహనంలో ఉన్న సుమారు పది మందికి స్వల్ప గాయాలు కాగా, వారిని వెంటనేనర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


గాయపడిన మహిళ

బెల్ట్ షాపులపై దాడులు : ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలో అక్రమంగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. సిటిఎఫ్ భాస్కరరావుకు అందిన సమాచారం మేరకు, ఆనందపురం ఎస్ఐ పి.శివ, పోలీసులు, సిటిఎఫ్ సిబ్బంది కలిసి మామిడిలోవ గ్రామంలో జరిపిన సోదాలో జి.నాగరాజు (42) బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.180 ఎం ఎల్ సామర్థ్యంలోని 95 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గండిగుండంలో నిర్వహించిన దాడిలో కె.గంగరాజు (42) మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తూ కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుండి 180 ఎమ్ఎల్ పరిమాణంలో 211 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిపైనా కేసులు నమోదు చేసి రిమాండ్ తరలించామని పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఎస్ఐ జి.సంతోష్ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

ప్రజాశక్తి- లీగల్ : లారీని నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.8 వేలు జరిమానా విధిస్తూ చీఫ్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఎం.ప్రవీణ్ కుమార్ గురువారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకపోతే ఒక నెల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు పరిహారం అందించేలా చూడాలని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థకు ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలావున్నాయి... మధ్యప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ రామకృష్ణ శుక్లా (26) 2022 ఫిబ్రవరి 7వ తేదీన లారీని అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి, ఓల్డ్ డెయిరీ ఫార్మ్ జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆగి ఉన్న ద్వి చక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దినసరి కూలి పనులు పూర్తి చేసుకొని భీమునిపట్నం నుండి బైక్‌పై వస్తున్న ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనపై మృతుల్లో ఒకరి భార్య కనకాల నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు అప్పట్లో ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితుడి నేరాన్ని సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ నిరూపించడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెలువరించారు.

అదుపుతప్పి లారీ బోల్తా

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక శ్రీనగర్ బ్రిడ్జ్ వద్ద భారీ లారీ అదుపుతప్పింది. లారీ జారిపడి రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం క్రేన్‌ను ఏర్పాటుచేసి లారీని సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఈ నెల 2 నుండి 8వ తేదీ వరకు మావోయిస్టు పార్టీ పిఎల్జీఏ వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏజెన్సీ వ్యాప్తంగా హైఅలర్ట్ నెలకొంది. మండలంలోని పోలీసులు గురువారం ఎక్కడికక్కడ విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానితులను విచారించారు. దూసరపాము రహదారిపై రాజవొమ్మంగి సీఐ గౌరీ శంకర్, ఎస్సై శివకుమార్ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టి రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు జరిమాన విధించారు.

వాహన చోదకులకు లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-జీకే వీధి : వాహన చోదకులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని జికె.వీధి సిఐ సురేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. ఎక్కువమంది యువకుల సరైన రికార్డులు, లైసెన్స్, సి బుక్, ఇన్సూరెన్స్, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తుండగా వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇకపై వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, లైసెన్స్ లేకుండా ప్రయాణిస్తే రూ.5000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరస్మరణీయ న్యాయవాది హరనాథ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పేద ప్రజలు, సమాజం కోసం పనిచేసిన న్యాయవాది నాగిరెడ్డి హరనాథ్ అని పలువురు వక్తలు కొనియాడారు. న్యాయవాది, ఐలు నాయకుడు హరనాథ్ సంస్మరణ సభ గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఐలు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు అల్లు సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. సంఘం గౌరవాధ్యక్షులు బివి.రామాంజనేయరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల వెంకటేశ్వరరావు, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్‌కె.శ్రీనివాస్, ఎల్‌పి.నాయుడు, అల్లూరి విజ్ఞాన కేంద్రం బాధ్యులు విఎస్.పద్మనాభరాజు, మావయ్య ఆర్.లక్ష్మణరావు, అశ్వనీకుమార్, మూర్తి, పూర్ణిమ తదితరులు మాట్లాడారు. పేద ప్రజలు, ఉద్యమకారుల తరుపున పనిచేసిన న్యాయవాది హరనాథ్ అని గుర్తుచేసుకున్నారు. వివాదాల విషయంలో ఇరు గ్రూపులను ఒప్పించి రాజీమార్గంలో పరిష్కరించడంలో దిట్ట అని కొనియాడారు. ఆయన మార్గం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఐలు జిల్లా కార్యదర్శి శ్రీధర్ వందన సమర్పణ చేశారు. సభలో జిల్లా నాయకులు చిట్టిబాబు, ఆనందరెడ్డి, మణి, భవాని, సంతోషి, మృదుల, ఫాతిమా, పాపారావు, పార్వతీశ్వరరావు, గణపతి, కుమార్, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహిళలకు హక్కులు, చట్టాలు, రక్షణపై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ద్వారకా నగర్ నాలుగో లైన్‌లో ఉన్న బా బాపు భవన్‌లో గురువారం సాయంత్రం మహిళల హక్కులపై న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన మాట్లాడారు.

పాత్రికేయులపై చిన్నచూపు తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత్రికేయుల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీవ్ర నిర్లక్ష్య వైఖరిపై జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.కీర్తన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాత్రికేయులకు అక్రిడేషన్ల మంజూరులో విధిస్తున్న షరతులకు నిరసనగా గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జాప్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ఒంటెద్దు పోకడలపై విరుచుకుపడ్డారు. కార్యక్రమంలో సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జెవికె.అప్పలరాజు పాల్గొన్నారు.

దాడులు సరే.. చర్యలేవీ ?

ఎసిబి తీరుపై సర్వత్రా విమర్శలు

అధికారుల తనిఖీలనంతరం పైరవీల్లో సబ్ రిజిస్ట్రార్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా సహా రాష్ట్రమంతటా ఇటీవల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి దాడులు జరిగినప్పటికీ అనంతరం తగు చర్యలు తీసుకోవడంలో జాప్యం జరగడంతో సబ్‌రిజిస్ట్రార్‌లు లాబీయింగ్‌కు పాల్పడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. విశాఖలోని వన్ టౌన్, మధురవాడల్లో కొద్ది రోజుల క్రితం ఎసిబి అధికారులు వరుస దాడులు చేపట్టారు. పలు రికార్డులను స్వాధీన పరుచుకున్నారు. ఈ క్రమంలో అక్రమ రిజిస్ట్రేషన్‌లు, భూ లావాదేవీల్లో భారీగా అవినీతి జరిగినట్లు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల అనధికారిక నగదును కూడా ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్నట్లు భోగట్టా. తనిఖీలతో అక్రమ రిజిస్ట్రేషన్‌లు, పలు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భారీగా అవినీతి జరిగినట్లు గుర్తించారు. అక్రమ రికార్డులు పలుచోట్ల బయటపడ్డాయి.

సర్దుకుంటున్న సబ్‌రిజిస్ట్రార్లు

ఎసిబి దాడుల పిదప తాజాగా సబ్‌రిజిస్ట్రార్‌లంతా స్థానాలు మారకుండా చూసుకుంటున్నట్లు భోగట్టా. ప్రభుత్వ శాఖల్లో పెచ్చుమీరుతున్న అవినీతికి ఇదో తాజా తార్కాణం. రాష్ట్రంలో 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 18 నెలల కాలంలో రిజిస్ట్రేషన్స్, రెవెన్యూ, పోలీసు శాఖలో అవినీతి, అక్రమ వ్యవహారాలు సహా ప్రజలపై పెనాల్టీలు వంటివి పెట్రేగిపోయాయి. స్థానికంగా ఎంఎల్‌ఎలకు సబ్‌రిజిస్ట్రార్‌లపై ఫిర్యాదులున్నప్పటికీ వారి జోలికి వెళ్లడం లేదు. తాజాగా జరిగిన ఎసిబి దాడులతో అధికారులే మంత్రుల పేషీ, ఇతర ఉన్నతాధికారుల వద్ద లాబీయింగ్‌కు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల ఎసిబి దాడులనంతరం విశాఖ జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులను అనకాపల్లి జిల్లాలోని పలు ఎస్ఆర్ కార్యాలయాలకు బదిలీ చేసినప్పటికీ ఆ స్థానాలకు వెళ్లి ఆ పోస్టింగుల్లో చేరేందుకు ఎవరూ అడుగులు వేయడం లేదు. పలువురు సబ్‌రిజిస్ట్రార్‌లు చేతివాటం ప్రదర్శిస్తూ పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు.



జగదాంబ దరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సాగుతున్న తనిఖీలు (ఫైల్)

విశాఖపట్నం డిఐజి ఏమన్నారంటే...

ఎసిబి దాడుల తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తాజాగా ఏం జరుగుతోంది ? చర్యలేమైనా ఎవరిపైనైనా తీసుకున్నారా ? అని 'ప్రజాశక్తి' విశాఖపట్నం రిజిస్ట్రేషన్స్ డిఐజి బాలకృష్ణను వివరణ కోరగా ప్రభుత్వమే ఈ వ్యవహారాన్ని చూస్తోందన్నారు. తాను కొంత సమాచారాన్ని ఎస్ఆర్‌లకు సంబంధించి ఇచ్చానన్నారు. ఉన్నతాధికారులే దీనిపై రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. ఒకటి, రెండు రోజుల్లో బదిలీలపై స్పష్టత వచ్చే అవకాశముందన్నారు.

క్రికెటర్ కరుణ కుమారికి ఘన సత్కారం


కరుణ కుమారిని అభినందిస్తున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నవంబర్‌లో భారత్ వేదికగా జరిగిన భారత జట్టు అంధుల మహిళా టి-20 వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన విశాఖ బాలికల అంధుల రెసిడెన్షియల్ విద్యార్థిని కరుణ కుమారిని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఘనంగా సత్కరించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖా అధికారులు, అంధ పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు గురువారం సాయంత్రం కరుణ కుమారిని జిల్లా పరిషత్తు జంక్షన్ నుండి కలెక్టరేట్ వరకు ఊరేగింపుగా తీసుకురాగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, పూలమాలంకరణతో ఘనంగా సత్కరించారు. ప్రపంచకప్‌కు సెలెక్ట్ అయిన తరువాత ప్రాక్టీస్‌కు అనుగుణంగా కరుణకుమారికి ప్రత్యేకంగా రెండు క్రికెట్ కిట్లు కోసం రూ.50 వేలు అందించారు. భారత జట్టు విజయంలో కీలక ప్రతిభ చూపినందుకు ప్రోత్సాహకంగా జిల్లా కలెక్టర్ రూ. లక్ష చెక్‌ను అందజేశారు. క్రికెట్ ఫర్ ది బ్లైండ్ ప్రెసిడెంట్ శరత్ కరుణ కుమారిని అభినందిస్తూ రూ.లక్ష చెక్‌ను ఇచ్చారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి కవిత, క్రికెట్ ఫర్ ది బ్లైండ్ ప్రెసిడెంట్ శరత్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ నుంచి శీతల్, విద్యార్థులు పాల్గొన్నారు.

అదనపు పిపిగా పార్థసారథి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కం ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది కర్రి పార్థసారథిని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లా డిపార్టుమెంట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బాధ్యతల్లో ఆయన మూడేళ్లు విధులు నిర్వర్తించనున్నారు. ఈ క్రమంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన పార్థసారథికి టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంకె.శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర నాయకులు మానం శోభనబాబు, రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

డిడిఓ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు : ఏజెన్సీ విలీన మండలాల్లో డివిజన్ అభివృద్ధికి దోహదపడే విధంగా నూతన డిడిఓ కార్యాలయాన్ని గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. డివిజన్ అభివృద్ధి పనులు జరిగేందుకుగాను సమగ్రాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఈ భవనాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నూతన డిడిఓ విజయ్ కుమార్, సర్పంచ్ కారం కన్నారావు, జడ్పిటిసి చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు ఎండి జమాల్ ఖాన్, మాజీ అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు సాల్మన్ రాజు, జనసేన అధ్యక్షులు మడివి రాజు, బిజెపి అధ్యక్షులు బట్ట లక్ష్మణ్ రాజు, ఎంపీడీవో సుండం శ్రీనివాస్ దొర తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసుపై విచారణ

ప్రజాశక్తి-సీలేరు : మైనర్ బాలికను నమ్మించి అత్యాచారం చేసి మోసం చేసిన యువకుడుపై బాధిత బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు ఫోక్స్ చట్టం కింద స్థానిక ఎస్సై యాసీన్ కేసు నమోదు చేసిన నేపథ్యంలో దీనిపై గురువారం విచారణ చేపట్టారు. పోక్స్ కేసు దర్యాప్తులో భాగంగా చింతపల్లి ఏఎస్‌పి నవ జ్యోతి మిశ్రా సీలేరు పోలీస్ స్టేషన్ గురువారం వచ్చారు. ఎఎస్‌పి, స్థానిక ఎస్సై యాసీన్ సిబ్బందితో కలిసి నిందితుని ఇంటికి వెళ్లి పరిశీలించారు. పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి కేసు పూర్వపరాలను అడిగి ఆరా తీశారు.

విద్యార్థుల సమస్యలపై ఆరా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కాంగ్రెస్ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆధ్వర్యాన ఎఐసిసి జాతీయ అధికార ప్రతినిధి సునీల్ అహిరా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం పర్యటించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. రీడింగ్ రూమ్‌లో విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయట్లేదని, ఏళ్ల తరబడి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నామని పలువురు చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు వేగి వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు మార్టిన్ లూథర్, అమర్ జహన్ బైగ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్నికల సంఘం సిఇఒ పర్యటన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ఎన్నికల సంఘం సిఇఒ వివేక్ యాదవ్ శుక్ర, శని, ఆదివారాలలో విశాఖపట్నం, ఎఎస్ఆర్ జిల్లాలలో పర్యటిస్తారు. ఈ మేరకు ఆయన పర్యటన ఖరారైంది. ఆయన శుక్రవారం రాత్రి వాయు మార్గం ద్వారా విశాఖపట్నం చేరుకుంటారు. శనివారం ఉదయం విశాఖపట్నం కలెక్టరేట్‌లోని ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై ఇఆర్ఒ, ఎఇఆర్ఒలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించి పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేస్తారు. ఆదివారం విజయవాడ వెళ్తారు.

ఇంజినీరింగ్ విభాగంపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జివిఎంసి ఇంజినీరింగ్ విభాగంపై అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ, ప్రధాన ఇంజినీరు సత్యనారాయణ రాజు, పర్యవేక్షక ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. బీచ్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు పలు ప్రాజెక్టుల అమలుపై ఎస్ఆర్‌యు టీం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను కమిషనర్ తిలకించారు.